క్లుప్తంగా

అంబులెన్సుల తనిఖీ



నర్సంపేట రూరల్ : నర్సంపేటలోని 108, 102, 1962 అంబులెన్సులను జిల్లా ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (ఈఓ) రాజ్‌కుమార్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. అనంతరం వాహనాల పనితీరును పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు, సలహాలు అందించారు. కార్యక్రమంలో లోకో ఈఎంటీఎస్ ప్రవీణ్, అనిల్‌కుమార్, అజీజ్ పాషా, పైలెట్స్ ప్రేమ్‌సాగర్, రాజు, పాషా తదితరులు పాల్గొన్నారు.

జీవనియంత్రణ ఎరువులతో పంటల రక్షణ



దుగ్గొండి : జీవనియంత్రణ ఎరువులతో పంటల రక్షణ సాధ్యమని వరంగల్ జీవ నియంత్రణ ప్రయోగశాల అసిస్టెంట్ డైరెక్టర్ మాధవి తెలిపారు. మండలంలోని తిమ్మంపేటలో ట్రైకోడర్మ విరిడి, సూడామోనాస్‌లపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. మిరప, మొక్కజొన్న పంటల్లో వేరుకుళ్లు సోకి మొక్కలు చనిపోకుండా జీవ ఎరువులు ఉపయోగపడతాయని చెప్పారు. ఎకరాకు 8 కిలోల ట్రైకోడర్మ విరిడిని 100 కిలోల వేపపిండిలో కలిపి వేయాలని సూచించారు. అనంతరం రైతులతో కలిసి పంటలను పరిశీలించి సస్యరక్షణ చర్యలను వివరించారు. ట్రైకోడర్మ విరిడి ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఓ బానోతు మాధవి, ఏఈఓ వైజయంతి, తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళిక తయారీపై శిక్షణ



గీసుకొండ : మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, క్షేత్ర సహాయకులకు 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పనుల గుర్తింపు, ప్రణాళికల తయారీపై శిక్షణ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. లేబర్ బడ్జెట్‌కు సరిపడా పనులను గుర్తించి 300 శాతం ఉండేలా చూసుకోవాలని ఎంపీడీఓ కమలాకర్ సూచించారు. అక్టోబర్ 2న అన్ని గ్రామ పంచాయతీల్లో సభలు నిర్వహించి పనులకు ఆమోదం తీసుకుని డీఆర్‌డీఏ కార్యాలయానికి నివేదిక పంపాలని చెప్పారు. కార్యక్రమంలో పీఆర్ ఏఈ సుధాకర్, ఎంపీఓ చంద్రకాంత్, ఈసీలు శ్రీలత, రాజు, టీఏలు సురేశ్, సుష్మ, ఓంకార్ పాల్గొన్నారు.

వైద్యశిబిరం



దుగ్గొండి : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన పారిశుద్ధ్య కార్మికులకు డాక్టర్ కిరణ్‌రాజు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ రవిచంద్రారెడ్డి, ఎంపీడీఓ లెక్కల అరుంధతి, ఎంపీఓ మోడెం శ్రీధర్‌గౌడ్, పంచాయతీ కార్యదర్శి పోలు రాజేంద్ర ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

సన్మానం



నల్లబెల్లి : భద్రాది పుణ్యక్షేత్రానికి రైలు మార్గం ఏర్పాటు కోసం మౌన దీక్ష, యాగాలు, పాదయాత్రలు నిర్వహించిన అఖిల భారత హనుమాన్ ప్రచారకుడు గాదెపాక రాములును స్థానిక షిర్డీ సాయిబాబా ఆలయంలో ధర్మకర్త జీవన్ భక్తులతో కలిసి గురువారం శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం జీవన్ మాట్లాడారు. భద్రాద్రికి రైలు మార్గం ఏర్పాటు కోసం రాములు చేసిన పోరాటం అభినందనీయమని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం రైల్వే మార్గం ఏర్పాటుకు నిధులు కేటాయించిందని చెప్పారు.

ఉపాధ్యాయులకు..

ఖానాపురం : మండలంలోని ధర్మరావుపేట హైస్కూల్‌లో బదిలీ అయిన ఉపాధ్యాయులు అశోక్, రమేశ్, అరుణ, రజియాలను సన్మానించారు. ఈ సందర్భంగా ఎంఎన్ఓ చరణ్‌సింగ్ మాట్లాడారు. కార్యక్రమంలో హెచ్ఎం ఆరీఫ్ హుస్సేన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'టఫ్' అధ్యక్షుడిగా భాస్కర్

నల్లబెల్లి : టఫ్ మండల అధ్యక్షుడిగా తంగెళ్ల భాస్కర్‌ను నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు నందగిరి రజినీకాంత్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధాన కార్యదర్శిగా కొయ్యడ కుమారస్వామి, కోశాధికారిగా ఒడెల రవి, అధికార ప్రతినిధిగా పల్లికొండ రవిలను నియమించినట్లు వివరించారు.



వర్ధన్నపేట : ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే నాగరాజు



పర్వతగిరిలో..

ఐలమ్మ పోరాటం స్ఫూర్తిదాయకం

చాకలి ఐలమ్మ పోరాటం స్ఫూర్తిదాయకమని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు, వక్తలు కొనియాడారు. నర్సంపేట, వర్ధన్నపేట, పర్వతగిరి, తదితర మండలాల్లో ఆమె 129వ జయంతి వేడుకలు గురువారం నిర్వహించారు. ఆమె విగ్రహాలకు, చిత్రపటాలకు అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు నివాళులర్పించారు.

–సాక్షి నెట్‌వర్క్



చెన్నారావుపేట : కేక్ కట్ చేస్తున్న నాయకులు



గీసుకొండ : ధర్మారంలో..



నల్లబెల్లిలో..



రాయపర్తిలో..



నెక్కొండలో..

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి



సీడ్ బాల్స్ తయారు చేస్తున్న సభ్యులు, విద్యార్థులు

వర్ధన్నపేట : సమాజంలోని ప్రతిఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని వాసవీ వనిత క్లబ్ వర్ధన్నపేట శాఖ అధ్యక్షురాలు యాంసాని రాధిక ఆకాంక్షించారు. పట్టణంలో విద్యార్థులతో కలిసి ఆ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం 5 వేల సీడ్ బాల్స్‌ను తయారు చేశారు. ఈ సందర్భంగా రాధిక మాట్లాడారు. భూమిపై రోజురోజుకు కాలుష్యం పెరిగిపోయి పర్యావరణానికి ముప్పు వాటిల్లుతోందని చెప్పారు. మొక్కలు నాటడంతోపాటు సీడ్ బాల్స్ చల్లితే మొక్కలు పెరిగి చెట్లు అవుతాయని తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ కోశాధికారి అడ్డగూడి లావణ్య, సభ్యులు బొజ్జ సరిత, బీరవెల్లి విజయలక్ష్మి, విద్యార్థినిలు పాల్గొన్నారు.

లక్ష్యసాధనలో ఆత్మవిశ్వాసం ప్రధానం



మాట్లాడుతున్న డాక్టర్ భరత్‌కుమార్

వర్ధన్నపేట : విద్యార్థులు లక్ష్యాన్ని సాధించాలంటే ఆత్మవిశ్వాసాన్ని పెంచుకోవడం ప్రధానమని ప్రముఖ మానసిక వైద్యుడు డాక్టర్ ఎస్.భరత్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బోర్డ్ ఆఫ్ ఇంటర్‌మీడియట్ ఎడ్యుకేషన్, వైద్య ఆరోగ్య శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ గూళ్ల వెంకటయ్య అధ్యక్షతన వ్యక్తిత్వ వికాసంపై గురువారం నిర్వహించిన కార్యక్రమానికి అతిథిగా డాక్టర్ భరత్‌కుమార్ హాజరై మాట్లాడారు. విద్యార్థి దశలోనే బంగారు భవిష్యత్తు దిశగా ఆలోచించాలని సూచించారు. క్రమశిక్షణతోపాటు సానుకూల ఆలోచనా విధానాన్ని అలవర్చుకోవాలని చెప్పారు. ప్రణాళికాయుతంగా చదువుకుని ఉత్తమ ఫలితాలు సాధించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఉద్బోధించారు. ఆత్మవిశ్వాసం పెంచుకోవడానికి, మానసిక దృఢత్వానికి సూచనలు, సలహాలు అందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు రాజేంద్రప్రసాద్, సీహెచ్.వేణు మాధవి, శోభారాణి, రాజ్‌కుమార్,, సువర్ణవేణి, సమీనా, స్వరూప, బోధనేతర సిబ్బంది అనిల్‌కుమార్, రమ, ఇద్దమ్మ, ఉమారాణి, నవీన్, రాజు పాల్గొన్నారు.

'ఎమ్మెల్యే నాగరాజు వ్యాఖ్యలు సిగ్గుచేటు'



నిరసన తెలుపుతున్న మహేందర్, తదితరులు

వర్ధన్నపేట : దేశ అత్యున్నత స్థానమైన సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జిలు ఇచ్చిన ఏబీసీడీ వర్గీకరణ తీర్పును అపహాస్యం చేసేలా స్థానిక ఎమ్మెల్యే నాగరాజు వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటని ఎంఎస్‌పీ జిల్లా ఇన్‌చార్జ్ బిర్రు మహేందర్, జిల్లా అధికార ప్రతినిధి మాసాని గోపాల్ అన్నారు. పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్‌లో ఆ పార్టీ ఆధ్వర్యంలో గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మహేందర్, గోపాల్ మాట్లాడారు. నియోజకవర్గంలో 6 వేల మంది మాల, 60 వేల మంది మాదిగ కులస్తులు ఉన్నారని చెప్పారు. మాల కులస్తుల ఓటుతోనే గెలిచామని ప్రకటించడం సరికాదన్నారు. మాదిగ కులస్తుల పట్ల వివక్షతాపూరిత వ్యాఖ్యలు చేసిన నేపథ్యంలో ఎమ్మెల్యే నాగరాజు వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో మాదిగ కులస్తుల చేతిలో గుణపాఠం తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు గోలి సుధాకర్, జిల్లా ధర్మయ్య, బిర్రు గోపాల్, బిర్రు భిక్షపతి, గోలి రాజు తదితరులు పాల్గొన్నారు.

యోగాతో ఒత్తిడి జయించొచ్చు

నర్సంపేట రూరల్ : యోగాతో ఒత్తిడిని జయించొచ్చని ప్రముఖ యోగా గురువు జి.సదానందం తెలిపారు. నర్సంపేట మండలంలోని మహేశ్వరంలోని జెడ్పీ సెకండరీ స్కూల్‌లో ఇంపాక్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పర్సనాలిటీ డెవలప్‌మెంట్, మోటివేషన్ తరగతి గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సదానందం మాట్లాడారు. విద్యార్థులు యోగా సాధన చేస్తూ ఒత్తిడిని జయించి విద్యలో రాణించాలని సూచించారు. విద్యార్థులు యోగా సాధన చేయాలని చెప్పారు. కార్యక్రమంలో మోటివేషనల్ స్పీకర్ బొప్పరాతి వేణుగోపాల్, హెచ్ఎం స్వరూప, ఉపాధ్యాయులు అర్జున్, సాగర్, వేణుబాబు, సీతారామాచార్యులు, శ్రీలత, రాజేశ్వరి, రమేశ్, రేఖ, తదితరులు పాల్గొన్నారు.

'ఏఎంసీ నియామకంలో ప్రామాణికత పాటించాలి'

వర్ధన్నపేట : స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) నియామకంలో ప్రామాణికత పాటించాలని బీఆర్ఎస్ పార్టీ అనుబంధ ఎస్సీ సెల్ నాయకుడు కంజర్ల మహేశ్ కోరారు. పట్టణంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని అర్హతలున్న వ్యక్తినే చైర్మన్‌గా ఎంపిక చేయాలని ఆకాంక్షించారు. సమావేశంలో నాయకులు చెన్నయ్య, అమర్, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

ఖానాపురం : ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి యాకయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో ఆ ఫెడరేషన్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని గురువారం చేపట్టారు. ఈ సందర్భంగా యాకయ్య మాట్లాడారు. జీఓ నంబర్ 317తోపాటు, సీపీఎస్‌ను, ఉపాధ్యాయుల సర్దుబాటును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని, పెండింగ్ డీఏలను విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో ఫెడరేషన్ బాధ్యులు నర్సింహులు, మోతీలాల్, జగన్, సంతోశ్, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు పేరు కొనసాగించాలి

పర్వతగిరి : హైదరాబాద్‌లోని తెలుగు విశ్వవిద్యాలయానికి పొట్టి శ్రీరాములు పేరు కొనసాగించాలని ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు దారం పూర్ణచందర్ డిమాండ్ చేశారు. ఆ సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో గురువారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పూర్ణచందర్ మాట్లాడారు. కార్యక్రమంలో సంఘం మండల కార్యదర్శి పుల్లూరి భిక్షపతి, గ్రామ కమిటీ అధ్యక్షుడు దొడ్డ శ్రీనివాస్, నాయకులు దారం రాము, దుబ్బ రాజేశ్వర్, దొడ్డ రమేశ్, దేసు రాము, విజయ్, పూర్ణచందర్, ఈగ శ్రీనివాస్, దారం వెంకటేశ్వర్లు, దొడ్డ వెంకటేశ్వర్లు, ఉపేందర్, లక్ష్మీనర్సింహయ్య, చంద శ్రీనివాస్, నరేశ్, సాయి గణేశ్, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

దారి మళ్లింపు



చెన్నారావుపేట : మండలంలోని జల్లి మీదుగా చెన్నారావుపేటకు వెళ్లే దారిని మళ్లిస్తున్నట్లు ఆర్ అండ్ బీ అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ) సతీశ్ తెలిపారు. నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆదేశాల మేరకు మండలంలోని తిమ్మరాయినిపహాడ్-పాపయ్యపేట మధ్య కుంగిన వంతెనను ఏఈ సతీశ్ గురువారం సందర్శించి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడారు. కొద్ది రోజుల క్రితం కురిసిన భారీ వర్షాలకు కల్వర్టు కింది భాగం కొంత మేరకు కుంగిందని చెప్పారు. ఈ నేపథ్యంలో ప్రమాదాలు చోటు చేసుకోకుండా ముందస్తుగా బస్సులు, లారీలు, ఇతర వాహనాలు జల్లి నుంచి ఎల్లాయగూడెం మీదుగా పాపయ్యపేటకు వెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కంచ ప్రభాకర్, మాజీ వార్డు సభ్యులు మేడి సంతోశ్, హంస వినోద్, కన్నం సందీప్, కాంట్రాక్టర్ అజయ్‌రెడ్డి పాల్గొన్నారు.

హేచరిస్ వ్యర్థాలతో చెరువు కలుషితం

రాయపర్తి : మండల కేంద్రంలోని సత్యనారాయణ పౌల్ట్రీ హేచరిస్ నుంచి వస్తున్న వ్యర్థాలతో మంచినీళ్ల చెరువులోని నీరు కలుషితం అవుతున్నట్లు స్థానికులు తెలిపారు. రెండ్రోజులుగా గ్రామస్తులు పోరాటం చేస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో గుబ్బెడుతండాకు చెందిన నరేందర్‌ను హేచరిస్ మేనేజర్ సంతోశ్ ఫోన్‌లో దూషించాడంటూ గ్రామస్తులు పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఫిర్యాదు చేశారు. అనంతరం గ్రామపంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడారు. అధికారులు హ్యాచరీస్ నుంచి చెరువులోకి వస్తున్న వ్యర్థాలపై చర్యలు తీసుకోవాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

ఖానాపురం : మండల కేంద్రంలో గురువారం చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. ఎస్సై రఘుపతి కథనం ప్రకారం.. మండలంలోని ధర్మరావుపేటకు చెందిన రాకేశ్, లక్ష్మి, మమత ద్విచక్ర వాహనంపై నర్సంపేటకు వెళ్లి స్వగ్రామానికి తిరిగి వస్తుండగా మండల కేంద్రంలోని శివారులో నర్సంపేట దిశగా వెళ్తున్న కారు ఢీకొట్టింది. క్షతగాత్రులను స్థానికులు చికిత్స నిమిత్తం నర్సంపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు.

'సహ' నియోజకవర్గ కన్వీనర్‌గా రాహుల్



పర్వతగిరి : సమాచార హక్కు రక్షణ చట్టం–2005 వర్ధన్నపేట నియోజకవర్గ కన్వీనర్‌గా ఎద్దు రాహుల్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఎద్దు రాహుల్ విలేకరులతో గురువారం మాట్లాడారు. వివిధ విద్యార్థి సంఘాల్లో చురుకైన పాత్ర పోషిస్తూ విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం చేసిన కృషిని రాష్ట్ర కమిటీ గుర్తించి తనను నియమించిందని చెప్పారు.

రైతులకు కొత్త రుణాలతో లబ్ధి చేకూర్చాలి



వర్ధన్నపేట: రుణమాఫీ లబ్ధి పొందిన రైతులకు కొత్త పంట రుణాలిచ్చి లబ్ధి చేకూర్చాలని టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు కోరారు. వర్ధన్నపేట డీసీసీ బ్యాంకును గురువారం ఆయన సందర్శించి మాట్లాడారు. సరైన ఆధార్ నంబర్లు ఇచ్చిన రైతులకు లబ్ధి చేకూర్చాలని, బంగారు ఆభరణాల రుణాల రికవరీపై దృష్టి సారించాలని చెప్పారు. పీఏసీఎస్ చైర్మన్ రాజేశ్‌కన్నా, బ్యాంకు మేనేజర్ సమత పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

వర్ధన్నపేట : దమ్మన్నపేట గ్రామానికి చెందిన బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అబ్బిడి రాజిరెడ్డి తండ్రి లక్ష్మారెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. లక్ష్మారెడ్డి దశ దినకర్మకు రవీందర్‌రావు హాజరై కుటుంబ సభ్యులను పరామర్శించారు. కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు బొంపల్లి దేవేందర్‌రావు, ఎమ్మెల్యే తనయుడు దిలీప్‌రాజ్, మాజీ జెడ్పీటీసీ పాలకుర్తి సారంగపాణి, నాయకులు ఉన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి



దుగ్గొండి : నిరసన తెలుపుతున్న మాజీ సర్పంచ్‌లు



నర్సంపేట రూరల్ : వినతిపత్రం ఇస్తున్న నాయకులు

నర్సంపేట రూరల్ : పెండింగ్ బిల్లులు తక్షణమే చెల్లించాలని మాజీ సర్పంచ్‌ల ఫోరం గౌరవ అధ్యక్షుడు నామాల సత్యనారాయణ, అధ్యక్షుడు కొడారి రవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నర్సంపేటలోని వరంగల్ రోడ్డు కూడలి నుంచి మండల ప్రజాపరిషత్ కార్యాలయం వరకు గురువారం నిరసనా ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎంపీడీఓ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణ, రవి మాట్లాడారు. తాము గ్రామాల అభివృద్ధికి అప్పు చేసి పనులు చేశామని తెలిపారు. సంవత్సరాలు గడుస్తున్నా ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో తీవ్ర మానసిక వేదనకు గురౌతున్నట్లు చెప్పారు. అప్పులు ఇచ్చిన వ్యక్తులు ఒత్తిడి చేస్తున్నారని, కుటుంబ పోషణలోనూ ఇబ్బందులు అవుతున్నాయని వివరించారు. ఇకనైనా ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి వెంటనే పెండింగ్ బిల్లులు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు మోతె కళమ్మ, మాజీ ఎంపీటీసీ శ్రీలత, పెద్ది శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

దుగ్గొండి : మండల కేంద్రంలోని బస్టాండ్ సెంటర్‌లో రాస్తారోకో చేపట్టారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయం ఎదుట ప్లకార్డులు ప్రదర్శిస్తూ బైఠాయించారు. అనంతరం ఎంపీడీఓ లెక్కల అరుంధతికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు ఓడేటి తిరుపతిరెడ్డి, మోడెం విద్యాసాగర్, పైడయ్య, తదితరులు పాల్గొన్నారు.

చెన్నారావుపేట : మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షుడు కుండె మల్లయ్య మాట్లాడారు. ఎస్సై రాజేశ్‌రెడ్డి ఘటన స్థలానికి చేరుకుని ఆందోళన విరమింపజేశారు. అనంతరం ఎంపీడీఓ నల్ల శ్రీవాణికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు అనుముల కుమారస్వామి, బానోతు రమేష్, తదితరులు పాల్గొన్నారు.

నల్లబెల్లి : మండల పరిషత్ కార్యాలయం ఎదుట మాజీ సర్పంచ్‌ల ఫోరం ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షకు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బానోత్ సారంగపాణి, నాయకులు కక్కెర్ల శ్రీనివాస్, గందె శ్రీనివాస్, హింగ్లే శివాజీ, ఎంసీపీఐ(యూ) మండల కార్యదర్శి దామ సాంబయ్య సంఘీభావం తెలిపారు. దీక్షలో మాజీ సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు నానబోయిన రాజారాం, నాయకులు తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

ఖానాపురం : మండల పరిషత్ కార్యాలయం ఎదుట ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బత్తిని శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడారు. అనంతరం ఎంపీడీఓ భారతికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు ప్రవీణ్‌కుమార్, ఐలయ్య, నరేష్, హర్యానాయక్, వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

పోషకాహార లోప నివారణే ధ్యేయం



నల్లబెల్లి : ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు



ఖానాపురం : ప్రతిజ్ఞ చేయిస్తున్న అంగన్‌వాడీలు



చెన్నారావుపేట : అవగాహన కల్పిస్తున్న పారిజాతం

నల్లబెల్లి : చిన్నారులు, గర్భిణులు, బాలింతల్లో పోషకాహార లోపాన్ని నివారించడమే ధ్యేయంగా ప్రభుత్వం కార్యక్రమాలు చేపడుతోందని సీడీపీఓ మధురిమ తెలిపారు. పోషణమాస సంబరాల్లో భాగంగా హెల్త్, ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం తీసుకుంటే చిన్నారులు, గర్భిణులు, బాలింతలు ఆరోగ్యంగా ఉంటారని చెప్పారు. పోషకాహార లోపం ఉన్న చిన్నారులపై అంగన్‌వాడీ, వైద్య సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అనంతరం ఎంపీడీఓ నర్సింహమూర్తి మాట్లాడారు. విలేజ్ హెల్త్ శానిటేషన్, న్యూట్రిషన్ కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. తదనంతరం అంగన్‌వాడీ టీచర్లు తయారు చేసిన పోషకాహారాన్ని ప్రదర్శించారు. కార్యక్రమంలో నల్లబెల్లి, మేడపల్లి వైద్యాధికారులు రవీందర్ నాయక్, ఆచార్య, ఏసీడీపీఓలు శ్రీదేవి, హేమలత, సూపర్‌వైజర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఖానాపురం : మండలంలోని మనుబోతులగడ్డ, బండమీదిమామిడితండాల్లో నిర్వహించిన సమావేశాల్లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మాధవి మాట్లాడారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. అనర్థాల నేపథ్యంలో సెల్‌ఫోన్‌లను వినియోగించకూడదంటూ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సీహెచ్ఓ రాజయ్య, ఏఎన్ఎం సర్వోషిని, ప్రైమరీ స్కూల్ ఉపాధ్యాయులు అశోక్, తదితరులు పాల్గొన్నారు.

చెన్నారావుపేట : మండలంలోని బాపునగర్, ఖాదర్‌పేట అంగన్‌వాడీ సెంటర్లలో నిర్వహించిన కార్యక్రమాల్లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రాధ, పారిజాతం మాట్లాడారు. చిరుధాన్యాలు, పౌష్టికాహారం, తదితరాలపై అవగాహన కల్పించారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమాల్లో హెచ్ఎం విజయలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు జ్యోతి, కమల, సుగుణ, సుజాత, తదితరులు పాల్గొన్నారు.

ఎంఈఓలుగా నియామకం

వర్ధన్నపేట/దుగ్గొండి : వర్ధన్నపేట, దుగ్గొండి ఎంఈఓలుగా మామునూరు శ్రీధర్, ఎన్.వెంకటేశ్వర్లు నియమితులయ్యారు. ఈ సందర్భంగా వారు గురువారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. శ్రీధర్‌ను పీఆర్‌టీయూ అధ్యక్ష, కార్యదర్శులు మనుజేందర్ రెడ్డి, వెంగళ అశోక్, కుమారస్వామి, సభ్యులు శాలువా పూలమాలతో సన్మానించారు. అలాగే వెంకటేశ్వర్లును ఆ యూనియన్ మండల కమిటీ ఆధ్వర్యంలో సన్మానించారు.

ఇన్‌చార్జ్ ఎంఈఓలుగా..

పర్వతగిరి/ఖానాపురం/చెన్నారావుపేట : పర్వతగిరి, ఖానాపురం, చెన్నారావుపేట ఇన్‌చార్జ్ ఎంఈఓలుగా గాయపు లింగారెడ్డి, శ్రీదేవి, సరళ నియమితులయ్యారు. వారిని ఎమ్మార్సీ ఉద్యోగులు, సిబ్బంది శాలువాతో సత్కరించారు.

మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ జన్మదిన వేడుకలు

వర్ధన్నపేట : పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు కేక్ కట్ చేసి శ్రేణులకు పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడారు. ప్రధానిగా మన్మోహన్‌సింగ్ దేశ ఉన్నతికి, సమగ్రాభివృద్ధికి పాటుపడ్డారని కొనియాడారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆంగోతు అరుణ, నాయకులు సత్యనారాయణ, సమ్మెట సుధీర్, అఫ్సర్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పార్టీ గ్రామ కమిటీ ఎన్నిక

నల్లబెల్లి : మండలంలోని నారక్కపేటలో బీఆర్ఎస్ గ్రామ కమిటీని గురువారం ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల అధ్యక్షుడు బానోత్ సారంగపాణి మాట్లాడారు. అధ్యక్షుడిగా తిప్పారపు రాంబాబు, ఉపాధ్యక్షుడిగా బుర్గుల రవి, ప్రధాన కార్యదర్శిగా పెంట శివ ఎన్నికైనట్లు ప్రకటించారు. సభ్యులు యాదావిధంగా కొనసాగుతారని తెలిపారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడారు. గ్రామంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని చెప్పారు. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి పాటుపడతానని తెలిపారు.

బీఎస్ఆర్‌కేఎస్ కమిటీ..

గీసుకొండ : మండలంలోని మచ్చాపూర్‌లో భవన నిర్మాణ రంగాల కార్మిక సంఘం (బీఎస్ఆర్‌కేఎస్) కమిటీని గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా కుమ్మరికుంట్ల శివకుమార్, ప్రధాన కార్యదర్శిగా బండి కొమ్మాలు, ప్రచార కార్యదర్శిగా ఎలగొండ రాజమొగిలి, ఉపాధ్యక్షులుగా లక్కస్సు రవికుమార్, అమ్జద్, ఇప్ప శ్రీనివాస్, ప్రచార కార్యదర్శులుగా మూగల రవి, పోగుల రవి, కార్యవర్గ సభ్యులుగా ఎంబాడి రాజ్‌కుమార్, లక్క మహేందర్, డ్యాగల పరమేశ్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కోశాధికారి తాటికొండ మధు, రాష్ట్ర ప్రచార కార్యదర్శి వేములకొండ సంపత్, జిల్లా అధ్యక్షుడు చిలువేరు రాజేందర్, నాయకులు ఎంబాడి నర్సింహస్వామి, గోదాసి శ్రీను, సంగినేని కృష్ణ తదితరులు పాల్గొన్నారు.